## నేడు వాహనాల వేలం

బండ్లగూడ, మార్చి 25: శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26న వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలం వేయనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి దేవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాల వేలం పాటలో పాల్గొనదల్సిన వారు ఉదయం 11 గంటలకు ఉప్పరపల్లిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

## వన్ ప్లస్ ఫోన్ సర్వీస్ సెంటర్ వద్ద ఆందోళన



హిమాయత్‌నగర్‌లోని వన్ ప్లస్ ఫోన్ సర్వీస్ సెంటర్‌లో నిర్వాహకులతో వాగ్వాదం చేస్తున్న కస్టమర్లు

హిమాయత్‌నగర్, మార్చి 25: లక్షలు పెట్టి కొనుగోలు చేసుకున్న సెల్‌ఫోన్లు ఏడాది గడవక ముందే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. రిపేర్ కోసం హిమాయత్‌నగర్‌లోని వన్ ప్లస్ ఫోన్ సర్వీస్ సెంటర్‌లో ఇచ్చిన సెల్ ఫోన్లకు నెలల తరబడి రిపేరింగ్ చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలువురు వినియోగదారులు మంగళవారం సెంటర్ నిర్వాహకులతో ఆందోళనకు దిగారు.తమకు వన్ ప్లస్ సెల్‌ఫోన్ కంపెనీ తగిన న్యాయం చేయాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

## నేడు యూసుఫ్‌గూడలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే

జూబ్లీహిల్స్,మార్చి 25: యూసుఫ్‌గూడ సర్కిల్‌లో బుధవారం నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే జరగనుంది. కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ పరిధిలో ఆయా బృందాలు పర్యటించనున్నాయి. సర్వే బృందాలు యూసుఫ్ గూడ, వెంగళరావు నగర్, రహమత్ నగర్, ఎర్రగడ్డ, బోరబండ వార్డుల్లో పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. స్వచ్ఛ ఆటోలతో ఇంటింటి తడి,పొడి చెత్త సేకరణ, వ్యాపార సముదాయాల వద్ద.. రహదారుల వెంబడి.. బహిరంగ ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పై ప్రశ్నావళి రూపంలో ప్రజల స్పందన తెలుసుకోనున్నారు.

# అక్రమ నిర్మాణాల కూల్చివేత

### అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తే కఠిన చర్యలు
### రాజేంద్రనగర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీధర్



బండ్లగూడ, మార్చి 25: అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీధర్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని నలందనగర్ కాలనీలో ఓ వ్యక్తి జీ ప్లస్ ఫోర్ భవన నిర్మాణానికి అనుమతులు తీసుకొని అదనంగా మరో రెండు స్లాబ్ లను ఎక్కువగా నిర్మించారు. స్థానికలు ఇచ్చిన ఫిర్యాదుతో రాజేంద్రనగర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీధర్ వారికి అనేక మార్లు నోటీసులు జారీ చేసినా పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారు. దీంతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ సిబ్బందితో కలిసి మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీధర్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఎక్కడ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా తమ దృష్టికి తీసుకొస్తే వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనుమతులకు మించి నిర్మించిన స్లాబ్ లను కూల్చివేసిన రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది



## రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

### శంషాబాద్ అడిషనల్ డీసీపీ రాంకుమార్



శంషాబాద్ పట్టణంలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ రాంకుమార్, పాల్గొన్న ముస్లిం నాయకులు

శంషాబాద్ రూరల్, మార్చి 25 : ప్రశాంతంగా రంజాన్ వేడుకలను జరుపుకోవడం కోసం అందరూ సహకరించాలని శంషాబాద్ అడిషనల్ డీసీపీ రాంకుమార్ సూచించారు. మంగళవారం శంషాబాద్ డీసీపీ కార్యాలయంలోని హాల్‌లో శంషాబాద్ పరిధిలో ఉన్న ముస్లిం నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ రాంకుమార్ మాట్లాడుతూ... ప్రజలందరూ కలిసి రంజాన్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈద్గాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని పలువురు కోరారు. సమావేశంలో శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ బాలరాజు, నందిగామ, కొత్తూరు,శంషాబాద్ రూరల్ సీఐలు, ఎస్సైలు, మైనార్టీ నాయకులు జాంగీర్‌ఖాన్, తాజ్‌బాబా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో..వందల కోట్ల బకాయిలు

- రూ.250 కోట్లకు పైమాటే ..
- సర్కిల్ 17లో వంద మంది టాప్ డిఫాల్టర్స్‌కు వారెంట్లు
- ఓటీఎస్ స్కీమ్ ద్వారా బకాయిల చెల్లింపుల్లో వేగిరం
- మిగిలింది ఆరు రోజులే..





ఖైరతాబాద్, మార్చి 25 : ఆస్తి పన్నుల వసూళ్లలో జీహెచ్ఎంసీ వేగిరం పెంచింది. వరుసగా వారెంట్లు, రెడ్‌నోటీసులు, సీజ్ కార్యక్రమాలతో బకాయిదారులు బల్దియా కార్యాలయానికి పరుగులు పెడుతున్నారు. పన్నుల చెల్లింపునకు మరో ఆరు రోజులు మాత్రమే గడువు ఉండగా, ప్రస్తుతానికి సుమారు వంద మంది టాప్ డిఫాల్టర్స్‌కు వారెంట్లు జారీ అయ్యాయి. సర్కిల్ 17 పరిధిలో హోటల్ కత్రియా రూ.8కోట్లు, జాయ్ హాస్పిటల్ రూ.45 లక్షలు, పోలో హోటల్ రూ.40లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు మంగళవారం డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి తెలిపారు. అయితే ప్రభుత్వ కార్యాలయాల నుంచి మాత్రం బకాయిలు వసూళ్లలో ఆలస్యం జరుగుతోంది. బిల్లులు సిద్ధం చేయడం, బడ్జెట్ కేటాయింపులు తదితర సమస్యలతో బకాయిలు పెరుగుతూ వచ్చాయి. అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు కలిపి సుమారు రూ.250 కోట్ల వరకూ బకాయిలు ఉంటాయని అధికారులు తెలిపారు.

### సద్వినియోగమవుతున్న ఓటీఎస్ స్కీమ్

వరుస వారెంట్లు, సీజ్‌లతో దూకుడు పెంచడంతో ఆస్తి పన్నుల చెల్లింపుల్లో వేగిరం పెరిగినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, జీహెచ్ఎంసీ మొండి బకాయిదారుల కోసం ప్రవేశపెట్టి ఓటీఎస్ (వన్ టైమ్ సెటిల్‌మెంట్) స్కీమ్ కొంత సత్ఫలితాలనిస్తున్నట్లు కనిపిస్తోంది. బకాయిల వడ్డీ మీద 90శాతం మాఫీ అవుతుండడంతో 2011, 2014 నుంచి పన్నులు చెల్లించకుండా మొండికేసిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. సర్కిల్ 18 పరిధిలో రూ.187కోట్ల లక్ష్యం పెట్టుకోగా, రూ.164 కోట్లు చెల్లించారు. మిగతా రూ.23 కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రావాల్సి ఉందని డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తెలిపారు. కాగా బంజారాహిల్స్‌లోని ఏసీబీ, ఇరిగేషన్ కార్యాలయాల నుంచి కోట్ల రూపాయల బకాయిలు రావాల్సి ఉన్నట్లు తెలిసింది. ఓటీఎస్ స్కీమ్ ద్వారా ఏసీబీ కార్యాలయం రూ.1.5 కోట్లు, ఇరిగేషన్ కార్యాలయం రూ.54 లక్షలు చెల్లించే అవకాశం ఉన్నట్లు డిప్యూటీ కమిషనర్ పేర్కొన్నారు. అయితే తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలు విడిపోయిన తర్వాత ఇంకా విభజన సమస్యల వల్ల బకాయిలు భారీగా పేరుకుపోయినట్లు చెబుతున్నారు.

## ముదిరాజ్‌ల ప్రయోజనాలే లక్ష్యంగా కృషి చేద్దాం

### శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్



హైదర్‌గూడ మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బండ ప్రకాశ్

హిమాయత్‌నగర్, మార్చి25: రాష్ట్రంలో సామాజిక, ఆర్థికంగా, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్న ముదిరాజ్ ప్రయోజనాలే లక్ష్యంగా ప్రణాళికతో ముందడుగు వేద్దామని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ ముదిరాజ్ పిలుపు నిచ్చారు. మంగళవారం హైదర్ గూడలోని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో లాల్‌దర్వాజా ముదిరాజ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా బండ ప్రకాశ్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు సామా జిక, ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకొని అన్ని రంగాల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముదిరాజులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో లాల్ దర్వాజా ముదిరాజ్ నేతలు విజయ్ కుమార్, జగదీశ్, సుధాకర్, ధర్మవీర్, సదా, అనిల్ కుమార్, సురేందర్, సతీ ష్, కైలాష్, నవీన్, పోసాని అశ్విన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## అందాల పోటీలను రద్దు చేయాలి

హిమాయత్ నగర్ , మార్చి25: భారతదేశ సాంస్కృతిక, నైతిక విలువలను దిగజార్చే విధంగా హైదరాబాద్‌లో మే 7 నుంచి నిర్వహించే అసభ్యకరమైన అందాల పో టీలను రద్దు చేయాలని ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. జ్యోతి, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి. ప్రేంపావని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 72వ ప్రపంచ సుందరి పోటీలను వ్యతిరేకిస్తూ మంగళవారం హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను హానికరమైన వస్తువుగా చూపిం చడంతో పాటు సామ్రాజ్య వాద ప్రయోజనాలను ప్రోత్సహించేందుకే ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించేందుకు ప్రభుత్వం పూనుకోవడం సరైన విధానం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ డబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫమీదా, నగర అధ్యక్షురాలు పడాల నళిని,నగర ప్రధాన కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, నేత లు ఎన్.కరుణకుమారి, జ్యోతి, షహనా, అంజుమ్, గిరిజ, లక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద నిరసన చేస్తున్న మహిళా నేతలు





## సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలి

### మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ్ల

మణికొండ, మార్చి 25 : నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నామని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ్ల అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ అంజలి గార్డెన్స్ కాలనీలో గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా స్థానికుల సమస్యలు తెలుసుకున్నా రు.

- ల్యాంకో హిల్స్ సమీపంలో ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్ పక్కన వస్తున్న టీం ఫోర్ బహుళ అంతస్తుల సముదాయం సరియైన సాంకేతిక పద్ధతులు అవలంబించకుండా డ్రైనేజ్ పైప్‌లైన్ వేసిన కారణంగా ఇప్పటికీ నాలుగు సార్లు రోడ్డు కుంగిపోవడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకుపోయినా లాభం లేదన్నారు.
- హైదరాబాద్ వాటర్‌వర్క్స్ (జలమండలి శాఖ) నిర్ణీత సమయం లేకుండా ఇష్టం వచ్చినప్పుడు నీళ్లు వదులుతున్న కారణంగా స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు.
- ఏ రకమైన నోటీసు గానీ సమాచారం గానీ ఇవ్వకుండా మున్సిపాలిటీ అధికారులు ఇష్టానుసారంగా ఇంటి పన్ను ధరలను పెంచి వసూలు చేయడం పై మండిపడ్డారు.

అంజలి గార్డెన్ కాలనీవాసుల సమస్యల పరిష్కారం దిశగా సంబంధిత ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాలని మణికొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేందర్‌నాథ్‌రెడ్డి , గోరుకంటి విఠల్, కిరణ్ యాలాల తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాలే ఉద్యోగాలకు కీలకం



నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

హిమాయత్ నగర్ , మార్చి 25: పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు సమర్థత, నైపుణ్యాలు పెంచుకుంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులభతరంగా సాధించే అవకాశం ఉంటుందని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి దోహదపడే అనుభవాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌డీబీ ఫైనాన్సియల్ సర్వీసెస్, ఆర్‌బీఎల్ బ్యాంకు, హెచ్ఎస్‌బీసీ,తదితర రంగాలకు విద్యార్థులు ఎంపిక కాగా వారికి నియామక పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పి.సత్యానారా యణ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ నర్సింలు, డాక్టర్ రాపోలు శ్రీనివాస్, కడారి శ్రీనివాస్, డాక్టర్. రాజేశ్వర్, డాక్టర్ యాదయ్య, డాక్టర్ వేణు పాల్గొన్నారు.

## లక్డీకాపూల్ లోని ఓ హోటల్ లో వ్యభిచారం

### నిర్వాహకుడు, విటుడు, బంగ్లాదేశ్ యువతి అరెస్టు

ఖైరతాబాద్, మార్చి 25 : లక్డీకాపూల్‌లోని ది హోటల్ సెంట్‌లో గుట్టుగా జరుగుతున్న వ్యభిచార దందాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిర్వాహకుడు, విటుడితో పాటు ఓ యువతిని అదుపులోకి తీసుకున్నారు. ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్తీక్ దాస్ (29) చార్మినార్ ప్రాంతంలో నివాసం ఉంటూ లక్డీకాపూల్‌లోని ది హోటల్ సెంట్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని గుట్టుగా వ్యభిచార దందా నిర్వహిస్తున్నాడు. వాట్సాప్, ఆన్‌లైన్ ద్వారా యువతుల చిత్రాలను పోస్టు చేస్తూ విటులను ఆకర్షిస్తున్నాడు. ఒక్కొక్కరి వద్ద రూ.10వేల చొప్పున వసూలు చేస్తున్నాడు. ఘన్సీ బజార్‌కు చెందిన నగల తయారీదారుడు సమీర్ మైతి (35) ఆన్‌లైన్ ద్వారా ఓ యువతిని బుక్ చేసుకున్నాడు. ఒప్పందం ప్రకారం సెంట్ హోటల్‌కు చేరుకోగా, పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నిర్వాహకుడు, నిందితుడితోపాటు యువతిని అదుపులోకి తీసుకున్నారు. సదరు యువతి బంగ్లాదేశీయురాలని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పద్మశ్రీ హిల్స్ కాలనీలో సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న పద్మశ్రీ హిల్స్ కాలనీవాసులు

బండ్లగూడ, మార్చి 25: పద్మశ్రీ హిల్స్ కాలనీలో సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్రను కలిసి కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీలో డ్రైనేజీ కనెక్షన్లు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే చర్యలు తీసుకొని డ్రైనేజీ కనెక్షన్ లు వేసి, రోడ్ల ఆక్రమణలు తొలగించి, పార్కులను ఏర్పాటు చేయాలన్నారు.

## రాష్ డ్రైవింగ్.. అడ్డుకున్న కానిస్టేబుల్ పై దాడి

బంజారాహిల్స్, మార్చి 25: రోడ్డుపై అతివేగంగా వెళ్తూ వాహనదారుల పట్ల వెకిలిగా వ్యవహరిస్తున్న ఓ యువకుడిని ఓ కానిస్టేబుల్ అడ్డుకున్నాడు. దీంతో అతడిపై దాడి చేసి గాయపర్చాడు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన వసీం అహ్మద్(30) అనే వ్యక్తి టోలిచౌక్‌లో నివాసం ఉంటూ ఓ హోటల్ లో చెఫ్ గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 10:30 సమయంలో ఎమ్మెల్యే కాలనీ ఓమేగా ఆసుపత్రి మీదుగా బంజారా హిల్స్ రోడ్ నంబర్-12 వైపునకు బైక్ పై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ వెళ్తున్న వసీం అహ్మద్ వాహనాల్లో ఉన్న మహిళలకు సైగలు చేస్తూ ముందుకెళ్తున్నాడు. అదే రోడ్డుపై వెళ్తున్న బంజారాహిల్స్ కానిస్టేబుల్ శ్రీకాంత్ ఈ విషయాన్ని గమనించి వసీంను ప్రశ్నించాడు. దీంతో రెచ్చిపోయిన వసీం బైక్ ను శ్రీకాంత్ బైక్‌కు అడ్డుగా పెట్టి దుర్భాషలు ఆడాడు. అనంతరం ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఆగ్రహానికి గురైన వసీం రోడ్డు పక్కన ఉన్న బీర్ సీసాతో శ్రీకాంత్ తలపై కొట్టి కడుపులో పొడిచాడు. దీంతో శ్రీకాంత్ కు తీవ్ర రక్తస్రావం అయింది. అయినా వసీంను పట్టుకున్న కానిస్టేబుల్ స్థానికుల సాయంతో పోలీసులకు అప్పగించాడు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ సిటీ న్యూరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో నిందితుడు వసీం అహ్మద్ పై హత్యా యత్నం కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

# హామీలు అమలు చేయకుండా..కాలయాపన

### సీఐటీయూ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 25: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను, కార్మికులను మోసం చేస్తున్నారని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నా రు. మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాటేదాన్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రమోహన్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, భవన నిర్మాణ, మున్సిపాలిటీ, జీహెచ్ఎంసీ ఇండస్ట్రీయల్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ, ట్రాన్స్‌ఫోర్ట్స్, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలుస్, ఏఎన్ఎంలు, మెడికల్ అండ్ హెల్త్, సెక్యూరిటీ గార్డ్సు ఇలా అనేక రంగాల కార్మికులకు ఇస్తామన్నా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ప్రభు త్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా కార్మికుల పరిస్థితులు అర్థం చేసుకోకుండా వారి వేతనాలు, న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, హామీలను అమలు చేయాలని మొండిగా వ్యవహరిస్తే కార్మికులు చూస్తు ఊరుకోరని రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.రామ్మోహన్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, జిల్లా కమిటీ సభ్యులు జి.ఎం.కురుమయ్య, యెల్లేష్, పార్వతి, నర్సింహ, రాజేంద్రనగర్ నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు బచ్చలకూర స్వామి, జాహంగీర్, చంద్రమౌళి, లక్ష్మయ్య, రమేష్, కృష్ణయ్య, జంగయ్య, మౌలాలి పాల్గొన్నారు.



కాటేదాన్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

## దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక కేటాయింపులు పెంచాలి

### ప్రొ.ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్,మార్చి 25: దశాబ్ద కాలంగా కేంద్ర బడ్జెట్లో కేటాయింపులు చేయాల్సిన స్థాయిలో చేయకున్నా దక్షిణ భారత దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోందని డా బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.ఘంటా చక్రపాణి అన్నారు. డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఐసీఎస్ఎస్ఆర్ –దక్షిణ భారత దేశ ప్రాంతీయ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ‘భారతదేశంలో ఆర్థిక సమాఖ్యవాదం, వికేంద్రీకరణ, అభివృద్ధి , ఆర్థిక గతిశీలత’అనే అంశంపై జూబ్లీహిల్స్ లోని అంబేద్కర్ యూనివర్సిటీలో రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రొ. ఘంటా చక్రపాణి మాట్లాడుతూ..


భారత సమాఖ్యవాదం సమాన న్యాయం గురించి మాత్రమే కాదని , వనరులలో సమాన వాటా పంపిణీ అందాలని భావిస్తున్నామన్నారు. ఉత్తర–దక్షిణ ఆర్థిక నిధుల కేటాయింపులపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. దేశం ముందున్న సంక్లిష్ట సమస్యలపై చర్చించడం, వాటిని సరళీకృతం చేయడంతో పాటు ప్రభుత్వానికి విధానాలను ప్రతిపాదించడం కోసం మేధావులు, విద్యావేత్తలు ఇలాంటి సదస్సుల ద్వారా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ విశిష్ట అధ్యాపకులు ప్రొ. పినాకి చక్రవర్తి మాట్లాడుతూ.. 16వ ఆర్థిక సంఘం కొవిడ్ తర్వాత వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఆర్థిక అభివృద్ధి, నిర్వహణపై దృష్టి సారించామన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వనరుల అవసరం, లభ్యత మధ్య సమన్వయం కోసం ఆర్థిక సంఘం పనిచేయాలన్నారు. దేశంలో ఆర్థిక స్థిరత్వం, ఆర్థిక సంస్కరణల కోసం చట్టాన్ని బలోపేతం చేయడానికి ఆర్థిక కమిషన్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.వి.బాలకిష్టా రెడ్డి, ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సభ్యులు అరవింద్ వారియర్, అకాడమిక్ డైరెక్టర్ జి. పుష్పా చక్రపాణి, రిజిస్ట్రార్ డా.యల్. విజ యకృష్ణా రెడ్డి, సామాజిక శాస్త్రాల విభాగ డీన్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, కాన్ఫరెన్స్ డైరెక్టర్ డాక్టర్ కె కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రొ పినాకీ చక్రవర్తిని సత్కరిస్తున్న ప్రొ. ఘంటా చక్రపాణి

## తరగతి గదులు ,మూత్రశాలలు ప్రారంభం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 25: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి అండగా నిలవడం హర్షించదగ్గ విషయమని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ అన్నారు. అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రాంక్లిన్ టెంపుల్ టన్ వారి సహాయంతో రౌండ్ టేబుల్ ఇండియా చారిటబుల్ ట్రస్ట్ వారితో నూతనంగా నిర్మించిన నాలుగు తరగతి గదులు, మూత్రశాలలను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీతగౌరీశంకర్‌లు హాజరై మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ఈ పాఠశాలలో నిర్వహించాలని కోరారు. పాఠశాలకు అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్ నిర్మాణం అవసరం ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఫ్రాంక్లిన్ టెంపుల్ టన్ ప్రతినిధి నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణగా చదువుకొని మంచి ఫలితాలు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీలత, ప్రతినిధులు గౌరవ్, నాగలక్ష్మి, రౌండ్ టేబుల్ ఇండియా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మక్సూద్ అహ్మద్, చైతన్య, హర్షిత్, లోకేష్, సీతారాం, శ్రీనివాస్‌సాగర్, ఉపాధ్యాయులు విజయ, సాయిప్రసాదరావు, రోజారాణి, సుజాత, జ్యోతి, జకీరాబేగం, హేమలత, రంగారెడ్డి తదితరులున్నారు.





అత్తాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న దృశ్యం

**బహిరంగ ప్రకటన**

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది మరియు తెలియజేయునదేమనగా నా క్లయింట్ తండ్రి అయిన స్వర్గీయ చింతచెట్టి వెంకట చలపతి తండ్రి సి.సుబ్రమణ్య చెట్టి గారు ఎస్ఆర్ఓ హైదరాబాద్ ఈస్ట్‌లో రిజిస్టర్ అయిన రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.393 ఆఫ్ 1968 క్రింద, బృందావన్ కాలనీ, నార్సింగి గ్రామం, హైదరాబాద్ వెస్ట్ తాలూకా, ఇంతకు ముందు హైదరాబాద్ జిల్లా మరియు ఇప్పుడు గండిపేట మండలం, రంగారెడ్డి జిల్లాలోని సర్వే నెం.159లో 445 చ. గజాలు విస్తీర్ణపు ప్లాట్ నెం.40ను కొనుగోలు చేశారు మరియు పైన తెలిపిన సదరు ప్లాట్ కొనుగోలు తేదీనుండి నా క్లయింట్ తండ్రి మరియు నా క్లయింట్ ఎటువంటి ఆటంకాలు లేకుండా స్వాధీనతను కలిగి ఉన్నారు మరియు కొందరు వ్యక్తులు నా క్లయింట్ యొక్క చాలా కాలంగా కొనసాగుతున్న స్వాధీనతలో జోక్యం చేసుకొనుటకు ప్రయత్నిస్తున్నారు మరియు పైన తెలిపిన ప్లాట్‌కు సంబంధించి నా క్లయింట్‌కు తప్ప ఇతర వ్యక్తులకు ఏలాంటి హక్కు లేదని హెచ్చరిక చేయనైనది, ఇందునిమిత్తమే ఈ హెచ్చరిక ప్రకటన జారీ చేయబడినది

సం/- వి.నర్సింగ్ రావు, అడ్వకేట్
3-5-118/56, ప్లాట్ నెం.56, స్ట్రీట్ నెం.2, కృష్ణ నగర్, హైదర్‌గూడ, అత్తాపూర్ సమీపాన, హైదరాబాద్-48, తెలంగాణ. మొబైల్ నెం.9391007025

**CAUTION NOTICE**

This is to inform the public that the undersigned my client i.e., Smt. Madi Manjula, W/o. Madi Raju Reddy, D/o. K.Bal Reddy, R/o. 1-107, Aziz Nagar, Moinabad, Hyderabad-500 075, Telangana is the legal heir of Late Kuntlur Bal Reddy, S/o. Rami Reddy who was the absolute owner of a Residential House property bearing No. 2-3 in Gramakantam, adm. 212.4 Sq.yards (177.56 Sq.meters), situated at Manikonda Jagir Village, Gandipet Mandal, Ranga Reddy District, Telangana. The said Kuntlur Bal Reddy passed away on 16-03-2023 leaving behind him, my client and her two Brothers i.e., K.Madhusudhan Reddy & K.Krishna Reddy as legal heirs entitled to succeed his estate. However, it has come to knowledge that her Brothers K.Madhusudhan Reddy and K.Krishna Reddy have entered into a sale transaction in respect of part of the said property in favour of K.Ravinder Reddy and Gudla Jeevan Kumar. These transactions are illegal and invalid in the eyes of the law, as my client, being the legal heir, having a legitimate right and share in the said property, which has not yet been partitioned. Her Brothers are attempting to alienate the part of the property to K.Ravinder Reddy and Gudla Jeevan Kumar under an Agreement of Sale, Dated 06-02-2025, which is similarly illegal and non-binding due to the ancestral nature of the property. As such, my client is in the process of filing a Civil Suit for partition and separate possession of the said property, which will assert her rightful share as per the Hindu Succession Act, 1956. Hence, this notice is issued to prevent any further illegal sale transactions and to inform the public at large that any such transactions regarding the said property in question will be considered void and non-binding on my client. My client will take appropriate legal action to safeguard her rights over the said property, including seeking the cancellation of any sale deeds and an order for partition and separate possession. All parties are hereby cautioned to take note of this legal dispute and restrain from any dealings with the said property until the legal matters are resolved. Hence the Caution Notice.

**PATLOLLA MADHAVA REDDY, Advocate**
H.No. 8-7-92/LK/118,
Near TNR Sulakshna Apts.,
Laxmi Narsimha Puram Colony,
Hasthinapuram, R.R. District-79,
Hyderabad, **Ph: 9849232922.**